క్లుప్తంగా

వరి కోతలు వాయిదా వేసుకోండి
ఏఓ సంజీవరావు



నాగాయలంక: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కోతలను మరో నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని ఏఓ సంజీవరావు చెప్పారు. మండలంలోని దిగువ గ్రామం కమ్మనమోలులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎ.సంజీవరావు మాట్లాడుతూ మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రాల్లో 80 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని అత్యవసరమైతే వాటిని వాడుకుని వర్షాలు తగ్గాక తిరిగి అప్పగించాలని ఏఓ రైతులకు చెప్పారు. మండలంలో ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తక్కువ ధరలకు బయట అమ్ముకుని నష్టపోవద్దని హెచ్చరించారు. మినుము సాగుపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ సహాయకుడు సురేష్, రైతులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్



కోడూరు: కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ దివిసీమ–కోడూరు ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. క్లబ్ మండలాధ్యక్షుడు పూతబోయిన సీతారత్నసాయిబాబు సొంత ఖర్చులతో వీటిని అందించారు. పాఠశాలలో 35మంది విద్యార్థులకు అందజేశారు. చిన్నారులు విద్యార్థి దశ నుంచే సామాజిక సేవను అలవర్చుకోవాలని సాయిబాబు సూచించారు. హెచ్ఎం వై.సుధారాణి, క్లబ్ సభ్యులు కోట రాంబాబు, ఉపాధ్యాయులు వెంకటనాగేంద్ర, మురళీమోహన్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేత



పెడన: పట్టణంలోని విశ్వభారతి ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జాతీయ వినియోగదారుల వారోత్సవాల పోటీల్లో గెలుపొంది జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ చేతుల మీదుగా బహుమతులను మంగళవారం అందుకున్నారు. ఇటీవల మచిలీపట్నంలోని లేడి యాంప్తిల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లాస్థాయి వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారని, 'వినియోగదారుల న్యాయ పాలనకు వర్చువల్ విచారణలు- డిజిటల్ సౌలభ్యం' అనే అంశంలో వకృత్వ పోటీలో పరసా దేవి మహీక్షిత (9వ తరగతి) ప్రథమ బహుమతి, వ్యాసరచన పోటీల్లో రౌతుల జ్యోతిక (9వ తరగతి) తృతీయ బహుమతి సాధించి జేసీ చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లును మచిలీపట్నం కలెక్టరేట్ మీటింగ్ హాలులో అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గౌరీప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో పార్వతీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని నిమ్మగడ్డలో డార్క్ నెస్ టు లైట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ నిర్వాహకులు బ్రదర్ కరుణానిధి రూ.65 వేలు విలువగల వస్త్రాలను వృద్ధులు, వితంతులకు పంపిణీ చేశారు. తొలుత ఆయన క్రిస్మస్ సందేశాన్ని అందించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వర్షం.. రైతుల్లో కలవరం



కృత్తివెన్ను మండలం అడ్డపర్ర వద్ద ధాన్యం రాశిపై పరదాలు కప్పుతున్న రైతులు



కోడూరులో పనపై వరి

కృత్తివెన్ను: కొన్ని రోజులుగా మారుతున్న వాతావరణం రైతులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం కూడా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవడంతో రైతుల్లో తీవ్ర కలవరం మొదలైంది. ఇప్పటికే వరికోతలు పూర్తిచేసిన రైతులు, హడావుడిగా కట్టేతలు పూర్తి చేస్తుండగా ధాన్యం రాశులపై రక్షణగా పరదాలు, గడ్డి కప్పుకునేవారు కనిపించారు. ఈ ఏడాది కోతలు ప్రారంభం నుంచి రైతులను వాతావరణం భయాందోళనలకు గురిచేస్తూనే ఉందని వాపోతున్నారు.

కోడూరు: అల్పపీడనం ప్రభావంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న ఓ మోస్తారు వర్షానికి కోడూరు మండలంలో వరిపంటకు అపార నష్టం వాటిల్లింది. మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉండటంతో వరిపంట ముంపు బారిన పడింది. మండలంలోని 13 పంచాయతీల్లో ఈ ఏడాది సుమారు 16వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారు. అకాల వర్షంతో పాటు చలి గాలుల తీవ్రత కూడా అధికంగా ఉంది. ప్రస్తుతం ఐదు వేల ఎకరాల్లో వరిపంట కోసి పనపై ఉంది. నీరు పొలాల్లో నిలవడంతో పాటు వరిపనలపై చేరిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పనపై ఉన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు వరికంకులకు మొలకలు వస్తాయని రైతులు వాపోతున్నారు. సుమారు ఐదు వేల ఎకరాల్లో రైతులు మినుము కూడా చల్లారు. ఈ వర్షంతో మినుములు కూడా పోతాయని వాపోతున్నారు. చేతికొచ్చే సమయానికి పంట వర్షార్పణం కావడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఇసుక తవ్వకాలు చేస్తే సహించం

- సాగునీటి కట్టడాలకు వందమీటర్లలోపు ఇసుక తవ్వుతుంటే ఏంచేస్తున్నారు
- అధికారులపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆగ్రహం
- ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



పులిగడ్డలో ఇసుక నిల్వ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

సాక్షి స్పందన

అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ అక్విడెక్టు ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరిపితే సహించేది లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హెచ్చరించారు. పులిగడ్డ అక్విడెక్టు ప్రాంతంలో జరుపుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై 'ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు' శీర్షికతో 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఇసుక తవ్వక ప్రాంతాన్ని మంగళవారం పలుశాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వాల్టా చట్టం ప్రకారం సాగునీటి కట్టడాలకు 500 మీటర్లలోపు ఇసుక తవ్వకాలు చేపట్టరాదనే నిబంధనలు ఉన్నాయని చెప్పారు. అలాంటిది వందమీటర్లలోపు ఇసుక తవ్వకాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవడంపై తహసీల్దార్ కె. నాగమల్లేశ్వరరావు, ఎస్ఐ కె.శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దివిసీమలోని మూడు మండలాలకు సాగు, తాగు నీరు అందించే పులిగడ్డ అక్విడెక్టుని పరిరక్షించుకోవాల్సిన భాధ్యత అందరిపై ఉందని కట్టడానికి దగ్గరగా ఇసుక తవ్వకాలు జరుగుతుంటే చోద్యం చూడటం ఏమిటని నిలదీశారు. ఇలాంటివి పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన



జేసీ గీతాంజలిశర్మకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

మచిలీపట్నంటౌన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాల నాయకులు మంగళవారం అంబేడ్కర్ సర్కిల్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ అధినేత మాయావతి పిలుపులో భాగంగా నిరసన నిర్వహించినట్లు నాయకులు పేర్కొన్నారు. కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేశారు. జేసీ గీతాంజలిశర్మకు నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ సేన అధ్యక్షుడు బూరగ రామారావు, నేతలు పాతపాటి పండు, తప్పెట రాజు, కీర్తి, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బొమ్మిడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

- కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఏఓ సీహెచ్ వీరాంజనేయప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నేతలు అబ్దుల్‌మతీన్, కోకా ఫణిభూషణ్ తదితర నాయకులు ఉన్నారు.

ఘంటసాల: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.

సత్రం సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో సీపీఎం నేతలు వాకా రామచంద్రరావు మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అంబేడ్కర్‌పై చేసిన అహంకార పూరిత వ్యాఖ్యలు దారుణమన్నారు. నేతలు మెడంకి వెంకటేశ్వరరావు, కంచర్ల నాగరాజు, బలె రమేష్, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

బాలవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

కోనేరుసెంటర్: బాలవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలని హైనీ విద్యాసంస్థల అసిస్టెంట్ ప్రధానోపాధ్యాయురాలు వెలివెల లీనారాణి అన్నారు. వీర్ బాల్ దివాస్ వారోత్సవాల్లో భాగంగా మాచవరంలోని హోంఆఫ్‌హోప్‌లో వారం రోజులుగా చిన్నారులకు నిర్వహించిన వివిధ వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం లీనారాణి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 17వ శతాబ్దంలో ఔరంగజేబుపై గురుగోబింద్‌సింగ్ కుమారులైన తాహిర్‌సాహిద్‌జనాఫతేసింగ్, అతని సోదరుడు జోరావార్‌సింగ్ చిన్న వయసులో వీరోచిత పోరాటం చేసి డిసెంబరు 26వ తేదీ వీరమరణం పొందినట్లు చెప్పారు. వీరిద్దరినీ స్మరించుకుంటూ ఏటా వీర్‌బాల్ దివస్‌ను నిర్వహిస్తుందన్నారు. అలాంటి సాహసవీరుల వీరగాథలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గొప్ప వ్యక్తుల చరిత్ర తెలుసుకున్న వ్యక్తులు వీరుల ఆశయాలు, పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో హోం ఆప్ హోప్ ఇన్‌చార్జ్ పి.స్వప్నలత, చీఫ్ ఫంక్షనరీ లింగం మోజెస్, మైఖేల్‌నతానియేల్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



ఉరివి రెవెన్యూ సదస్సులో అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్

కోసూరువారిపాలెం(మోపిదేవి): భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. కోసూరువారిపాలెంలో సర్పంచ్ కోసూరు అనూష అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై 5 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్ బాబు, మండల సర్వేయర్ రామకృష్ణబాబు, వీఆర్‌ఓ నీల్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 13 అర్జీలు

పెడన: ఉరివి, లంకలకలువగుంట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 13 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కె. అనిల్‌కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ భూమి సమస్యలపై ఆరు అర్జీలు రాగా, ఇతర వాటికి సంబంధించి, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఏడు అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. వీటిలో కొన్నిటిని అప్పటికప్పుడు పరిష్కరించామని, మిగిలిన వాటిని 50 రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సుల్లో వీఆర్వోలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: తపసిపూడి సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ తహసీల్దార్ సత్య మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే నెల 8వ తేదీ వరకు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజబాబు, ఆర్ఐ, వీఆర్వో, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతులు గోదాములను వినియోగించుకోవాలి

ఘంటసాల: రైతులు తమ ధాన్యాన్ని దేవరకోట, ఘంటశాల, మల్లంపల్లిలో గోదాములు, కొడాలి మార్కెట్ యార్డులో దాచుకోవాల్సినదిగా ఘంటసాల తహసీల్దార్ విజయ ప్రసాద్ మంగళవారం తెలిపారు. వాతావరణ శాఖ నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని సూచన మేరకు రైతులు గోదాములను వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

చర్చిలకు విద్యుత్ దీపాలంకరణ



అవనిగడ్డ 8వ వార్డు ఆర్‌సీఎం చర్చి వద్ద స్టార్, విద్యుత్ దీపాలంకరణ



విద్యుత్ దీపాలతో పెడన ఆర్సీఎం చర్చి



నాగాయలంకలో ఆర్‌సీఎం ప్రధాన చర్చి

అవనిగడ్డ: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని పలు చర్చిలను ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక పంచాయతీ పరిధిలోని కోటగిరిలంక ఆర్‌సీఎం చర్చి, ప్రధాన రహదారి పక్కనున్న గుహ వద్ద, 8వ వార్డు, మోదుమూడి ఆర్‌సీఎం చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కోటగిరిలంక గుహ వద్ద భారీ స్టార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పెడన: పట్టణంలోని తోటమూల ఆర్సీఎం చర్చిలో బాలఏసు ప్రతిష్ట తదితర కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి వరకు క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొంకేపూడిలోని సెయింట్ విన్సెంట్ చర్చి, పట్టణంలోని పలు ప్రార్థన మందిరాలను అలంకరించారు.

నాగాయలంక: నాగాయలంక ప్రధాన ఆర్‌సీఎం చర్చి ఆవరణతో పాటు ఆ ప్రాంగణంలోని ఏసు ప్రభువు, మేరీమాత విగ్రహాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వక్కపట్లవారిపాలెం శివారు ఎన్టీఆర్ కాలనీలోని బాప్టిస్ట్ దేవాలయంలో, గ్రామంలోని షెకీనా మినిస్ట్రీస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మండలంలోని మర్రిపాలెం, దేగలపాలెం, పెదపాలెం, ఏటిమొగ, ఎదురుమొండి, ఏసుపురం, మెరకపాలెం, గణపేశ్వరం, చోడవరం, పర్రచివర తదితర గ్రామాల్లో చర్చిలను సుందరంగా అలంకరించి ప్రార్థనలు చేశారు.

గూడూరు: మండలంలోని పలుచోట్ల చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా పైడమ్మ జాతర



పెడన: పట్టణంలోని శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు పది రోజుల నుంచి అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. స్థానికులు శిడిబండ్లు కట్టి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో టీవీవీ మోహనరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు. అమ్మవారు మంగళవారం రాత్రి గ్రామోత్సవానికి ఊరేగింపుగా బయల్దేరి వెళ్లి రేయింబవళ్లు పురవీధులలో సంచరించి బుధవారం ఉదయం ఆలయానికి చేరుకుంటారని ఈవో మోహనరావు తెలిపారు. బుధవారం ఉదయం ఏడుగంటలకు అమ్మవారికి ఊయల సేవ జరుగుతుందని పేర్కొన్నారు.

పడిపూజోత్సవాలకు ఏర్పాట్లు



కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో పడి పూజోత్సవాల నిర్వహణకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం రాత్రి పడిపూజకు సంబంధించిన అంకురార్పణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ మంగళవారం తెలిపారు. 26 ఉదయం స్వామివారి మూలమూర్తికి నవవిధ అభిషేకాలు, పుష్పాభిషేకాలు ఉంటాయన్నారు. 27 ఉదయం కేరళ తరహాలో భక్తుల సహకారంతో అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి లక్ష రూపాయి నాణేలతో అభిషేకాన్ని నిర్వహించనున్నట్లు భావన్నారాయణ చెప్పారు. 28న గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించి పడిపూజోత్సవాలను ముగించనున్నట్లు పేర్కొన్నారు.

'అవుట్‌ఫాల్'కు నిధులు మంజూరు చేయండి



అవనిగడ్డ: దివిసీమలో శిథిలమైన అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం బుద్ధప్రసాద్, కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ నూతనచైర్మన్ దోవబోయిన వెంకటేశ్వరరావు, గ్రామీణ యువజన వికాస సమితి చైర్మన్ మండలి వెంకట్రామ్‌తో కలసి మంత్రిని కలిశారు. నాబార్డు నిధులతో అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు నిర్మించడానికి మంత్రి హామీ ఇచ్చినట్టు బుద్ధప్రసాద్ చెప్పారు.

ఆంజనేయుడికి, గణపతికి వెండి పాదుకలు..కిరీటం



ఆంజనేయుడికి వెండి పాదుకలను అందజేస్తున్న దృశ్యం

పెడన: పట్టణంలో బస్టాండ్ సమీపంలోని శ్రీ గణపతి శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలోని ఆంజనేయ స్వామికి వెండిపాదుకలు, గణపతికి కిరీటంఅందజేశారు. రూ.50 వేల విలువైన వెండి పాదుకలను పేరక నాగేంద్రరావు శేషు కుమారి దంపతుల పెద్ద కుమారుడు, కోడలు జానకి రామానంద్, రూప దంపతులు స్వామి వారికి అందజేశారు. దేవాంగ ప్రముఖులు బళ్ల ప్రసాద్, బొడ్డు రామ్మూర్తి బొడ్డు కోట నాగయ్య, పులి బాబురావు, పెడన పట్టణ గౌడ్ సంఘం అధ్యక్షులు పడమట బలరాం తదితరులు పాల్గొన్నారు.

- గణపతి దేవుడికి బూరగడ్డ ప్రసాద్ అల్లుడు తిరుపతి వాస్తవ్యులైన మద్దుల బాబు, శ్రీవల్లిరాజ్యలక్ష్మీ దంపతులు రూ.30 వేలు విలువ చేసే వెండి కిరీటాన్ని అందజేశారు. గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రహదారిపై పేరుకున్న మట్టి తొలగింపు



కోడూరు: వరికోత మిషన్ల కారణంగా కోడూరు ప్రధాన రహదారిపై నిలిచిన మట్టిని పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. వర్షం కారణంగా నల్ల మట్టి మొత్తం రహదారిపై చేరి చిత్తడిగా మారింది. పెట్రోల్ బంక్ సమీపంలో రహదారి ప్రమాదకరంగా మారి, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచి వెన్నా షైనీ, కార్యదర్శి బండే శేషగిరిరావు సిబ్బంది సాయంతో ఈ మట్టిని తొలగించే ప్రయత్నం చేశారు.

అయ్యప్పకు రూ.1.50 లక్షల వెండి కవచం

కోడూరు: వీవర్స్‌కాలనీలో అయ్యప్ప స్వామివారి మూలమూర్తికి కోడూరుకు చెందిన పూతబోయిన సూర్యప్రకాశరావు రూ.1.50లక్షల విలువ చేసే వెండి కవచాన్ని బహూకరించారు. దాత సూర్యప్రకాశరావు కుటుంబీకులతో కలిసి ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెండి కవచాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కవచాన్ని ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి మూలవిరాట్‌కు అలంకరించారు. దాతను కమిటీ సభ్యులు సత్కరించారు. వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ, ఆలయ కార్య నిర్వాహణ కార్యదర్శి ఇంకొల్లు అశోక్‌మహారాజ్, సభ్యులు మత్తి సూరిబాబు, వడ్డే ఎర్రబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు

కృత్తివెన్ను: చినగొల్లపాలెం దీవిలో మంగళవారం నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు జరిపినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. బంటుమిల్లి, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, నరసాపురం ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని అధికారులు సిబ్బంది కలసి సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నరసింహపురం-విశ్వనాథపల్లి రోడ్డుపై సర్కస్ ఫీట్లే



కోడూరు: మండలంలోని నరసింహపురం నుంచి విశ్వనాథపల్లి వెళ్లే ప్రధాన రోడ్డుపై వాహనచోదకులు సర్కస్ ఫీట్లు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న మోస్తరు వర్షానికి రహదారి చిత్తడిగా మారింది. వ్యవసాయ పనులను సాకుగా చూపి ట్రాక్టర్లు, దమ్ము ట్రాక్టర్ల యజమానులు ఇష్టానుసారంగా వాహనాలను రహదారిపై తిప్పడంతో ఈ దుస్థితి నెలకొందని వాహనచోదకులు వాపోతున్నారు. దమ్ము చక్రాలు, ట్రాక్టర్ చక్రాలకు ఉండే నల్ల మట్టి రహదారిపై కుప్పలుగా పేరుకుని అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడూరు నుంచి నరసింహపురం వెళ్లే రహదారి కూగా ఇలాగే తయారైంది. ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు.





